మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర సంపుటి : 08 సంచిక : 194 బుధవారం 14 - 01 - 2026 పేజీలు: 8 వెల: 4

## పారిశుద్ధ్య కార్మికుల భద్రతకు ప్రాధాన్యం




3లో..

## సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి

- కుటుంబ సభ్యులతో కలిసి పండుగ వేడుకలు
- చిన్నారుల క్రీడలను ఆసక్తిగా తిలకించిన సీఎం
- ముగ్గులు, విజేతలకు బహుమతులు -- అర్జీల స్వీకరణ




నారావారిపల్లె, జనవరి 13, మన గళం,: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి తన స్వగ్రామమైన నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ఆయన సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, నారా బ్రాహ్మణి పాల్గొని గ్రామస్తులతో కలిసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.

సంక్రాంతి సంబరాల్లో భాగంగా గ్రామంలోని చిన్నారుల కోసం సంగీత కుర్చీలు, సమతుల్య నడక, గన్నీ సంచుల పరుగు, నిమ్మకాయ--చెంచా పోటీ, సంప్రదాయ కోడి పందెం, మూడు కాళ్ల పరుగు, గ్లాస్--బెలూన్ పరుగు వంటి క్రీడలను నిర్వహించారు. ఈ క్రీడలన్నింటినీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తిగా తిలకిస్తూ చిన్నారులతో కలిసి సంతోషంగా గడిపారు. విజేతలకు స్వయంగా బహుమతులు అందజేసి ప్రోత్సహించారు.

చిన్నారులందరితో కలిసి ఫోటోలు దిగిన ముఖ్యమంత్రి, వారితో ఆప్యాయంగా ముచ్చటించారు. మహిళలు వేసిన రంగురంగుల ముగ్గులను పరిశీలించి, వారికి బహుమతులు అందజేశారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామీణ వాతావరణంలో ప్రజలతో మమేకమై పండుగను జరుపుకోవడం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## దేశ నిర్మాణంలో యువశక్తే ముందువరుసలో ఉంది







- భారత్ మండపంలో యువ నాయకులతో ప్రధాని సంభాషణ
- సేవకు సంస్కారం తోడైతే అది జీవంత సంప్రదాయమవుతుంది
- వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్--2026లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం

న్యూఢిల్లీ, జనవరి 13: మన గళం, : వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్--2026 కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొని యువతను ఉద్దేశించి ప్రసంగించారు. వినూత్న ఆలోచనలు, అపార శక్తి, స్పష్టమైన లక్ష్యంతో కూడిన యువశక్తి దేశ నిర్మాణంలో ముందువరుసలో 2 లో..

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



- టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్
- 95 మందికి ఇంటి పట్టాలు పంపిణీ
- ఫిబ్రవరిలో మరో 500 మందికి గృహాలు కేటాయిస్తామని హామీ
- టిడ్కో సముదాయం వద్ద అన్ని వసతులు కల్పిస్తాం

2 లో..

## విదేశాల్లో ఉద్యోగాల పేరిట అంతర్జాతీయ సైబర్ ముఠాల బంధనం



- చీకటి గదుల్లో చిత్రహింసలు -- 19--20 గంటల బానిస పని
- మయన్మార్ కాంపౌండ్‌ల నుంచి భారతీయుల విముక్తి
- ఏపీకి చెందిన 22 మంది బాధితుల గాథలు వెలుగులోకి

మంగళగిరి, జనవరి 13 మనగళం,: విదేశాల్లో ఉద్యోగాల పేరిట అంతర్జాతీయ సైబర్ నేరాల ముఠాలు విసిరిన వలలో చిక్కుకుని మయన్మార్, కాంబోడియా, థయ్‌లాండ్, 2 లో..

## జమ్ము--కాశ్మీర్లో అనుమానాస్పద బెలూన్ కలకలం



- కథువా జిల్లా సరిహద్దు ప్రాంతంలో బెలూన్ స్వాధీనం
- పాకిస్తాన్ నుంచి వచ్చిందన్న అనుమానాలు
- ఎల్వోసీ వెంబడి భద్రత మరింత కట్టుదిట్టం

శ్రీనగర్, జనవరి 13 మన గళం,: జమ్ము--కాశ్మీర్‌లో పాకిస్తాన్ నుంచి వచ్చినట్లు అనుమానిస్తున్న 2 లో..


## మొదలు పెట్టండి... పరిస్థితి తెలుస్తుంది

- ఇ ఆఫీసు పని విధానంపై డాక్టర్ రఘునందన్ సూచన

మనగళం, కర్నూలు సిటీ : ఇ ఆఫీసు పని విధానంపై ఎక్కడో ఒక చోట మొదలు పెడితే... వాస్తవ పరిస్థితి తెలుస్తుందని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్ సూచించారు. ప్రభుత్వము పేపర్ లెస్ పని విధానం వంద శాతం జరగాలని లక్ష్యంగా నిర్దేశించు కుందని, అందువల్ల మెడికల్ కాలేజీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తిగా ఇ ఆఫీస్ ద్వారా ఫైల్స్ మరియు రోగులకు అందించే వైద్యం యొక్క ప్రతి ప్రకియ డిజిటల్ చేయాల్సిందేనని తెలిపారు. ఇందుకోసం మొదట ప్రతి విభాగం లో ఎక్కడో ఒకచోట ప్రారంభం కావాల్సిందే నని అప్పుడే అందులో వాస్తవ ఇబ్బందులు తెలుస్తాయని చెప్పారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సందర్శన అనంతరం మెడికల్ కాలేజీలోని కౌన్సిల్ సమావేశం మందిరంలో 2 లో..



## స్వదేశీ ఆయుధాలు సిద్ధం



బెంగళూరు, జనవరి 13,మన గళం, : దేశీయ రక్షణ తయారీ రంగంలో కీలక మలుపు చోటుచేసుకుంది. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఎస్ ఎస్ ఎస్ డిఫెన్స్ సంస్థ పూర్తిగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో 2 లో..

# దేశ నిర్మాణంలో యువశక్తే ముందువరుసలో ఉంది



నిలిచిందని ప్రధాని పేర్కొన్నారు. యువత ఆలోచనలు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయని, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువ నాయకుల పాత్ర అత్యంత కీలకమని ఆయన అన్నారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా ప్రధాని యువ నాయకులతో ప్రత్యక్షంగా సంభాషించారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల నుంచి వచ్చిన యువ ప్రతినిధులు తమ ఆలోచనలు, అనుభవాలను ప్రధానికి వివరించారు. ప్రజాసేవ, సాంకేతికత, సామాజిక మార్పు వంటి అంశాలపై యువత చూపుతున్న ఆసక్తిని ప్రధాని అభినందించారు.

ఈ సందర్భంగా కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రి మన్‌సుఖ్ మాండవియా మాట్లాడుతూ, సేవకు సంస్కారం తోడైతే అది కేవలం విధి కాకుండా జీవంత సంప్రదాయంగా మారుతుందని అన్నారు. భారతీయ విలువలు, సంస్కారాలతో కూడిన సేవాభావమే దేశాన్ని ముందుకు నడిపిస్తుందని ఆయన పేర్కొన్నారు.

వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్--2026 యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించే వేదికగా నిలిచిందని, దేశ అభివృద్ధిలో యువతను భాగస్వాములుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

# జమ్ము--కాశ్మీర్లో అనుమానాస్పద బెలూన్ కలకలం



ఒక బెలూన్ కలకలం రేపింది. ఎరుపు రంగులో, హార్ట్ ఆకారంలో ఉన్న ఈ బెలూన్‌ను కథువా జిల్లా పరిధిలోని పహర్‌పూర్ ప్రాంతంలో భద్రతా బలగాలు సోమవారం స్వాధీనం చేసుకున్నాయి. పహర్‌పూర్ ప్రాంతం భారత్--పాక్ సరిహద్దుకు సమీపంలో ఉండటంతో, ఈ ఘటన భద్రతా వర్గాల్లో ఆందోళనకు దారితీసింది.

ఇదే తరహాలో ఇటీవల అర్నియా ప్రాంతంలో కూడా ఒక అనుమానాస్పద బెలూన్‌ను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వరుసగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడంతో సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. బెలూన్ ఎక్కడి నుంచి వచ్చింది, ఏ ఉద్దేశంతో పంపించారన్న అంశాలపై భద్రతా దళాలు సమగ్రంగా విచారణ చేపట్టాయి.

ఇక ఆదివారం పాక్--భారత్ సరిహద్దు అయిన ఎల్వోసీ వద్ద నౌషేరా--రాజౌరి సెక్టార్‌లో కొన్ని డ్రోన్లు అనుమానాస్పదంగా ఎగురుతూ కనిపించాయి. వాటిని గుర్తించిన భారత సైన్యం వెంటనే కౌంటర్ చర్యలు చేపట్టడంతో ఆ డ్రోన్లు తిరిగి వెనక్కు వెళ్లిపోయినట్లు సమాచారం. భద్రతా సిబ్బంది వేగంగా స్పందించడం వల్ల ఎలాంటి డ్రోన్ భారత భూభాగంలోకి రాలేదని స్థానికులు తెలిపారు.

ఇటీవలి కాలంలో బెలూన్లు, డ్రోన్ల ద్వారా ఆయుధాలు, డ్రగ్స్ వంటి అక్రమ వస్తువులను పాకిస్తాన్ నుంచి భారత్‌లోకి పంపే ప్రయత్నాలు జరుగుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భద్రతా విభాగాలు గట్టి నిఘా కొనసాగిస్తున్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితిని ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.

# స్వదేశీ ఆయుధాలు సిద్ధం

రూపొందించిన తుపాకులను రాష్ట్ర పోలీసు దళాలు, ఉగ్రవాద నిరోధక ప్రత్యేక బృందాలకు సరఫరా చేయడానికి సిద్ధమైంది. ఇవి కేవలం భాగాల అసెంబ్లీ కాదు, శాతం శాతం భారతీయ మేధోసంపత్తితో రూపుదిద్దుకున్న ఆయుధాలుగా సంస్థ స్పష్టం చేసింది.రెండువేల ఇరవై ఆరు నుంచి అమల్లోకి వచ్చే విధంగా తొలి దశలో పోలీసు బలగాలు, ఉగ్రవాద నిరోధక బృందాలకు పీ--డెబ్బై రెండు అనే ఆధునిక తుపాకులను అందించనున్నారు. ఇది సైనికుడి ప్రధాన ఆయుధాన్ని పూర్తిగా కొత్తగా పునఃరూపకల్పన చేసిన నమూనా అని అధికారులు తెలిపారు. బరువు సమతుల్యత లోపాలను పరిష్కరించడం, అవసరానికి అనుగుణంగా మార్పులు చేసుకునే సౌలభ్యం, మూడు వందల మీటర్లకు మించి స్థిరమైన లక్ష్యసాధన సాధించే ఆధునిక బారెల్ సాంకేతికత ఇందులో ప్రధాన లక్షణాలుగా ఉన్నాయి.

అదే విధంగా ఎం--డెబ్బై రెండు కార్బైన్‌ను పట్టణ ప్రాంతాల్లో జరిగే ఉగ్రవాద నిరోధక చర్యల కోసం ప్రత్యేకంగా రూపొందించారు. ఇరుకైన ప్రాంతాల్లో వేగంగా కదలడానికి అనువుగా ఉండే ఈ ఆయుధం, అధిక ఒత్తిడి పరిస్థితుల్లో కూడా సమర్థవంతంగా పనిచేసేలా తయారు చేశారు. పొడవైన తుపాకులతో ఎదురయ్యే సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఈ నమూనాను అభివృద్ధి చేసినట్లు సంస్థ వెల్లడించింది.

ఈ పరిణామంతో ఆయుధాల దిగుమతులపై ఆధారపడే పరిస్థితికి ముగింపు పలికినట్లేనని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భద్రతను దిగుమతి చేసుకునే దశ నుంచి, శక్తిని దేశంలోనే తయారు చేసుకునే దశకు భారత్ అడుగుపెడుతోందని, రెండువేల ఇరవై ఆరు సంవత్సరం ఈ మార్పుకు ప్రతీకగా నిలవనుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# మొదలు పెట్టండి... పరిస్థితి తెలుస్తుంది

వివిధ విభాగాల అధిపతులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోగికి ఒక ఐడీ కేటాయిస్తున్నామని, అందులో రోగికి అందించే ప్రతి ప్రక్రియ అప్లోడ్ చేయడం ద్వారా చేసిన పనిని ఏ స్థాయిలో నైనా అధికారులు పర్యవేక్షణ, సమీక్ష చేయవచ్చునని తెలిపారు. ఇందులో మనం చేసిన ప్రతి పని కూడా ఉన్నత అధికారులకి తెలుస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఓ. పి వైద్య సేవలు సాయంత్రం వరకు అందించాల్సిందేనని తెలిపారు. జిల్లాస్థాయి ఆసుపత్రిలో ప్రతిరోజు రెండు నుంచి మూడు వేల మందికి వైద్యం సేవలు అందితున్నాయని, పని భారం ఎక్కువున్న మాట వాస్తవమేనన్నారు. మనం చేస్తున్న పనిని డిజిటలేషన్ చేయడం ద్వారా అవి ఉన్నత స్థాయి అధికారులకు తెలుస్తుందని, రోగులకు కూడా వారి ఆరోగ్య సమాచారం నిక్షిప్తం చేపడుతుందన్నారు. ఎప్పుడు అవసరమున్న ఐడి నెంబర్ ఓపెన్ చేసి పూర్వ సమాచారం తెలుసుకొని వైద్య సేవలు అందించ వచ్చు నని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డి.యం.ఇ లు, ప్రిన్సిపల్ డాక్టర్ కె చిట్టి నరసమ్మ, సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, రీజినల్ ఐ హాస్పిటల్స్ సూపరిండెంట్ సత్యనారాయణ రెడ్డి, క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ ప్రకాష్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ విజయ్ ఆనందబాబు, డాక్టర్ సిందియా శుభప్రద వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : పేదల సొంతింటి కల నెరవేర్చడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని, ఆ దిశగా ముందుకు సాగుతున్నామని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. పేదలకు టిడ్కో గృహాల కేటాయించారు. ఆయా గృహాల లబ్ధిదారులకు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ తో కలిసి తాళం అందజేశారు. అందేవిధంగా 95 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టిడ్కో గృహాలను అన్ని విధాలుగా సిద్ధం చేసి లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. టిడ్కో సముదాయం వద్ద అన్ని వసతులు కల్పిస్తామని చెప్పారు. విద్యుత్, తాగునీరు, బస్సు సౌకర్యం, పోలీస్ భద్రత అన్ని ఏర్పాటు చేస్తామన్నారు. గృహాలు తీసుకున్న లబ్ధిదారులు వెంటనే వచ్చి నివాసం ఉండాలని, తద్వార మరొకరు వచ్చి నివాసం ఉండేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. గత ప్రభుత్వం టిడ్కో గృహాలను అసలు పట్టించుకోలేదని, సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే ఇది సాధ్యమైందని తెలిపారు. టిడ్కో గృహాల దగ్గరలోనే ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్ ఉందని, ఈ ప్రాంత వాసులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని చెప్పారు. అదేవిధంగా టిడ్కో గృహాల ఎదురుగా స్టేడియం నిర్మిస్తున్నామని, రానున్న రోజుల్లో టిడ్కో ప్రాంతం ఎంతో డెవలప్ అవుతుందని భరోసా ఇచ్చారు.

# విదేశాల్లో ఉద్యోగాల పేరిట అంతర్జాతీయ సైబర్ ముఠాల బంధనం



వియత్నాం, లావోస్ తదితర దేశాల్లో చైనీయుల ఆధ్వర్యంలోని సైబర్ నేరాల కాంపౌండ్‌ల్లో బందీలుగా మారిన వేలాది మంది భారతీయులు అనుభవించిన భయానక హింసా గాథలు వెలుగులోకి వచ్చాయి. చుట్టూ ప్రైవేటు సైన్యం, చేతుల్లో అత్యాధునిక ఆయుధాలు, చెప్పినట్లు చేయకపోతే చీకటి గదుల్లో పడేసి విద్యుత్ షాక్‌లు, కొట్టడం, తిండి పెట్టకుండా పస్తులు, భారీ నీటి క్యాన్లు పట్టించి గంటల తరబడి గుంజీలు తీయించడం వంటి చిత్రహింసలు భరించాల్సి వచ్చిందని బాధితులు వెల్లడించారు.

మయన్మార్‌లోని కాంపౌండ్‌ల్లో చిక్కుకున్న కొంతమంది బాధితులను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇటీవల రక్షించి భారత్‌కు తీసుకొచ్చింది. వారిలో 22 మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు ఉన్నారు. సోమవారం మంగళగిరిలోని సీఐడీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యాలయంలో సైబర్ నేరాల విభాగం ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, డీఎస్పీ రవికిరణ్ సమక్షంలో బాధితులు తమ అనుభవాలను మీడియాకు వివరించారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్, కాల్‌సెంటర్ ఉద్యోగాలు, లక్షల్లో జీతం అంటూ సామాజిక మాధ్యమాల్లో ఆకర్షణీయ ప్రకటనలు చూపించి ఉచ్చులోకి లాగారని వారు వాపోయారు. కొందరు స్థానిక ఏజెంట్ల ద్వారా కూడా వెళ్లినట్లు చెప్పారు. పర్యాటక వీసా, విమాన టికెట్లు పంపించి ముందుగా థయ్‌లాండ్‌కు తీసుకెళ్లారని, అక్కడ విమానాశ్రయంలో దిగిన వెంటనే చైనా హ్యాండ్లర్లు పాస్‌పోర్టులు, మొబైళ్లు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అనంతరం 12--13 గంటల ప్రయాణం చేయించి దట్టమైన అటవీ ప్రాంతాల గుండా సరిహద్దులు దాటించి మయన్మార్‌కు తరలించారని చెప్పారు. ఎత్తైన ప్రహరీ గోడలు, జైళ్లను తలపించే కాంపౌండ్‌ల్లోకి తీసుకెళ్లి రోజుకు 19--20 గంటల పాటు బలవంతపు పని చేయించారని, తప్పించుకోవాలని ప్రయత్నిస్తే కాల్చి పడేస్తామని బెదిరింపులు చేశారని బాధితులు గుండెచప్పుడు తో వివరించారు.

ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, విదేశీ ఉద్యోగాల ప్రకటనలను నమ్మేముందు ధృవీకరణ తప్పనిసరిగా చేయాలని సీఐడీ అధికారులు సూచించారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి అంతర్జాతీయ సైబర్ ముఠాలపై చర్యలకు సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## సీ.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను పంపిణీ



మనగళం, కర్నూలు సిటీ : ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కౌతాళం మండలం రౌడూరు గ్రామానికి చెందిన కురువ సావిత్రి, కోసిగి కి చెందిన తిక్క లక్ష్మీ, హొళగుంద కు చెందిన బోయ లక్ష్మి, వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామానికి చెందిన అనురాధ, కర్నూలు పట్టణానికి చెందిన దేవాన్స్ కు సీ.ఎం సహాయ నిధి ద్వారా రూ.2,17,948 చెక్కులు మంజూరు అయ్యాయి. ఈ మేరకు ఆయన నగరంలోని తన కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు.

## సంక్రాంతి శుభాకాంక్షలు



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా ప్రజలకు కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, పార్టీ అభిమానులకు, శ్రేయోభిలాషులకు కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, పత్తికొండ అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్, న్యాయవాది బి క్రాంతి నాయుడు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామాలలో రైతులు ఏడాదంతా కష్టపడి పండించిన పంటలు సంక్రాంతికి ఇంటికి వచ్చి ప్రతి ఇల్లు ధాన్యపు రాసులతో కలకలలాడు తుంటాయని సంతోషం వ్యక్తం చేశారు. భోగిమంటల భగ భగలు, చెడును దహనం చేసి, మంచిని కోరుకొనే పండుగ భోగ భాగ్యాల పండుగ సంక్రాంతి పండుగ నూతన సంవత్సరంలో మొదటి పండుగ అని హిందువులకు అతి ముఖ్యమైన పండుగ అని ప్రతి ఒక్కరు కుటుంబ సభ్యులతో పండుగను ఆనందంగా జరుపుకోవాలని క్రాంతి నాయుడు కోరారు.


## సంక్రాంతి అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలి



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా ప్రజలకు, అధికారులకు ఎం.పి బస్తిపాటి నాగరాజు ఒక ప్రకటనలో సంక్రాంతి పండుగ శు భాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలాని ఆకాంక్షించిన ఆయన, భోగ భాగ్యాలను అందించే భోగి, కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

## పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ లో పురోగతి తీసుకురావాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**



మనగళం, కర్నూలు సిటీ : సీఎం చంద్రబాబు నాయుడు పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ (ప్రజల అభిప్రాయం) విషయానికి చాలా ప్రాధాన్యత ఇస్తున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లాలో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ అంశంలో మరింత పురోగతి తీసుకొని రావాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి తెలిపారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ అంశం పై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ కి సంబంధించి ఆర్ ఓ ఆర్ కేసులలో, ఎఫ్ లైన్ పిటిషన్ లలో ప్రొసీజర్ ను పాటించి ప్రజల నుండి మంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని రావాలని ఆర్డీఓలకు సూచించారు. రెవెన్యూ క్లినిక్ లో వచ్చిన అర్జీలలో వెంటనే పరిష్కరించే సమస్యలు ఉంటే ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, జనవరి 27 వ తేదీ నాటికి రెవెన్యూ క్లినిక్ లో వచ్చిన అర్జీలను పరిష్కరించాలన్నారు. పెన్షన్ పంపిణీ లో ప్రజల నుండి సానుకూల స్పందన బాగుందని, మరింత సానుకూల స్పందన సాధించేందుకు కృషిచేయాలన్నారు. దీపం 2 పథకం కు సంబంధించి ఐవిఆర్ఎస్ కాల్ ఫీడ్ బ్యాక్ లో జిల్లా పురోగతి వెనుకబడి ఉందని, ఈ అంశంలో పురోగతి తీసుకొని రావాలని సూచించారు. బస్ స్టేషన్ లో నీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, టాయిలెట్స్ శుభ్రంగా ఉంచి పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ లో పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ ఆర్టీసీ ఆర్ఎమ్ ను ఆదేశించారు. అన్ని పంచాయతీ లలో ఇంటి ఇంటికి వెళ్లి పారిశుద్ధ్యం సిబ్బంది చెత్త సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యులు అందుబాటులో ఉండాలని, మందులకు బయటి పంపకుండా అన్నీ అందుబాటులో పెట్టుకోవాలని, పారిశుద్ధ్యం పనులు సక్రమంగా జరగాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ కూడా పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ లో పురోగతి తీసుకొని రావాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, ఐసిడిఎస్ పిడి విజయ, డి పి ఓ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల భద్రతకు ప్రాధాన్యం

**- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**
**- కార్మికులకు 21 రకాల పనిముట్ల అందజేత**




మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణతో పాటు పారిశుద్ధ్య కార్మికుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ, వారి ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం బి.క్యాంపు శానిటేషన్ స్టోర్ వద్ద రూ.82 లక్షల వ్యయంతో పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన 21 రకాల రక్షణ సామగ్రి, పనిముట్లను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రత కోసం పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజూ కఠిన పరిస్థితుల్లో శ్రమిస్తున్నారని, వారి భద్రత, ఆరోగ్య రక్షణ నగరపాలక సంస్థకు అత్యంత ముఖ్యమన్నారు. సరైన పనిముట్లు, రక్షణ సామగ్రి అందుబాటులో ఉంటే పని సామర్థ్యం పెరుగుతుందని, వ్యాధుల నివారణతో పాటు నగరంలో పరిశుభ్రత ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని అన్నారు. రూ.82 లక్షలతో 21 రకాల పనిముట్లు కొనుగోలు చేసి కార్మికులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. 49 పుష్ కార్ట్‌లు, ఎప్రాన్‌లు, మాస్కులు, చేతి గ్లౌజులు, రెయిన్ కోట్లు, చెత్త డబ్బాలు, టబ్‌లు, గడ్డ పారలు, చిన్న సైజు ఇనుప రేకులు, రేకు బొంగులు, పిక్ యాక్స్, కొడవళ్లు, సాలికలు, ట్రాక్టర్ కప్పేందుకు నెట్లు, పెద్ద సైజు పంజాలు, గొడ్డళ్లు, టాయిలెట్ బ్రష్‌లు, నాఫ్తలిన్ బంతులు వంటి మొత్తం 21 రకాల పనిముట్లు కలిపి 39,809 పనిముట్లు పారిశుద్ధ్య కార్మికులకు అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ సేవలు రైతుల ప్రగతికి దోహదపడాలి

**- సామూహిక ఎలుకల నివారణతో దిగుబడులు పెంచాలి - నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి**



మనగళం, కర్నూలు సిటీ : వ్యవసాయ శాఖ అధికారులు రైతుల సేవలో నిబద్ధతతో పనిచేసి వారిని ప్రగతి పథంలో ముందుకు నడిపించాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి సూచించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డైరీలో పొందుపరిచిన క్వాలిటీ కంట్రోల్ నిబంధనల ప్రకారం నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎలుకల నివారణకు సంబంధించిన పాంప్లెట్లు, పోస్టర్లను విడుదల చేశారు. పంట విత్తనం నుంచి కోత వరకు ఎలుకల వల్ల నష్టం జరుగుతున్నందున రైతులు సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో పాల్గొని మెరుగైన దిగుబడులు, అధిక లాభాలు పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారులు మరియు ఏపీ వ్యవసాయ అధికారుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు

## రైతులకు న్యాయం చేయండి



మనగళం, కర్నూలు సిటీ : ఓర్వకల్లు మండలం బైరాపురం రైతులకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ఏఓ వేణుగోపాల్ కు ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బైరాపురం గ్రామంలో 60 సంవత్సరాల కిందట 60 మంది రైతులకు సుమారు 150 ఎకరాలకు పట్టాలు మంజూరు చేశారన్నారు. అయితే ఆ పట్టాలు మంజూరు చేసిన భూమిని చాలామంది రైతులు సాగు చేసుకుంటూ వన్ బి, అడంగల్ పాస్ బుక్, కూడా తీసుకోవడం జరిగిందన్నారు. అయితే ఈ మధ్యకాలంలో ఓర్వకల్ ఇండస్ట్రియల్ రావడంతో భూముగల ధరలకు రెక్కలు వచ్చాయన్నారు. అయితే రెవెన్యూ అధికారులు, ఫారెస్ట్ అధికారులు ఈ పొలాన్ని రీ సర్వే చేయకుండా ఇది ఫారెస్ట్ ల్యాండ్ అంటూ ఒకరి మీద ఒకరు సాకులు చెప్పుకుంటూ రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సర్వే చేయించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఓర్వకల్ మండల కార్యదర్శి రమేష్, కల్లూరు మండల కార్యదర్శి బి రాముడు, రైతులు పాల్గొన్నారు.

## నగర ప్రజలకు కమిషనర్ సంక్రాంతి శుభాకాంక్షలు



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో అద్భుత ప్రారంభాలకు నాంది పలికి ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని కోరుకుంటూ నగర ప్రజలందరికీ నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగ భాగ్యాలతో భోగిని, సిరి సంపదలతో సంక్రాంతిని, కనువిందుగా కనుమని ప్రజలంతా జరుపుకోవాలని కమిషనర్ ఆకాంక్షించారు.

## ఐఫోన్ 15పై భారీ ఆఫర్.. వేల రూపాయలు తగ్గిన ధరతో కొనుగోలు ఛాన్స్..!!

హైదరాబాద్ -- 13-01-2026 -- మనగళం, భారత మార్కెట్‌లో ఐఫోన్ 15పై భారీ ధర తగ్గింపు అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ రిటైల్ స్టోర్ ద్వారా ఈ ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌ను ఇప్పటివరకు ఉన్న 79900 ప్రారంభ ధరతో పోలిస్తే కేవలం 52990కే కొనుగోలు చేసే అవకాశం లభిస్తోంది. ఈ ఆఫర్‌తో వినియోగదారులు దాదాపు 27000 వరకు నేరుగా ఆదా చేసుకోవచ్చు. అదనంగా అమెరికన్ ఎక్స్‌ప్రెస్ క్రెడిట్ కార్డ్ ద్వారా చెల్లింపు చేస్తే 7.5 శాతం వరకు తక్షణ డిస్కౌంట్ కూడా లభిస్తోంది. ఈ అన్ని ఆఫర్లు కలిపితే మొత్తం 30000కు పైగా లాభం పొందే అవకాశం ఉందని రిటైలర్లు వెల్లడిస్తున్నారు. అయితే ఈ ఆఫర్ పరిమిత కాలం మాత్రమే వర్తించనుందని స్పష్టం చేశారు. ఫీచర్ల విషయానికి వస్తే ఐఫోన్ 15లో 6.1 అంగుళాల సూపర్ రెటినా ఎక్స్‌డీఆర్ డిస్‌ప్లే, శక్తివంతమైన ఎ16 బయోనిక్ ప్రాసెసర్, 48 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరా, టైప్ సీ ఛార్జింగ్ సపోర్ట్, క్రాష్ డిటెక్షన్ వంటి ఆధునిక భద్రతా సదుపాయాలు ఉన్నాయి. భారీ ధర తగ్గింపుతో ఇప్పుడు ప్రీమియం ఐఫోన్‌ను మధ్యతరగతి వినియోగదారులు కూడా సులభంగా కొనుగోలు చేసే అవకాశమొచ్చిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

# రోడ్డు ప్రమాదాలు నివారించాలి






– మంత్రి టీజీ భరత్

మనగళం, కర్నూలు సిటీ : సాంకేతికను వినియోగించి రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మునిసిపల్ కాన్ఫరెన్స్ హాల్ లో రవాణా శాఖ ఆధ్వర్యములో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రితోపాటు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏఐని ఉపయోగించి బ్లాక్ స్పాట్స్ ముందుగా గుర్తించి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు. అతివేగముతో ప్రయాణాలు చేయడము వలన ప్రమాదాలు సంభవిస్తాయని, ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. ప్రతి డ్రైవర్ రెగ్యులర్ గాఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్యంగా ఉంటేనే డ్రైవింగ్ సమర్థవంతంగా చేయగలరని తెలిపారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వారోత్సవాల నుంచి మాసోత్సవాలు చేసారని, రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కర్నూలు జిల్లాలో మూడు డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కర్నూల్ డిప్యూటి ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ఎస్. శాంత కుమారి మాట్లాడుతూ రోడ్డుపైన ప్రయాణము చేసేటప్పుడు డ్రైవర్ యొక్క ఆరోగ్య పరిస్థితి చాలా ముఖ్యమన్నారు. కొందరి డ్రైవర్ల ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడం వలన కంటి, వైద్య పరీక్షలు చేయించుకోవడం లేదని, ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి డ్రైవర్ బాధ్యతగా డ్రైవ్ చేసినపుడే ప్రమాదాలు తగ్గుతాయని, మద్యం సేవించి ప్రయాణము చేయరాదని, రహదారి భద్రతా నియమాలు పాటించి ప్రయాణము చేయాలని సూచించారు. కార్యక్రమములో డిప్యూటి ట్రాన్స్ పోర్ట్ కమిషనర్, మోటార్ వెహికల్ ఇన్సపెక్టర్స్ మల్లికార్జున, రవీంద్ర కుమార్, మధుసూదన్, సుధాకర్ రెడ్డి, నాగరాజ నాయక్, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్లు బాబు కిశోర్, గణేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ కుదేలైన మార్కెట్లు..!



ముంబై -- 13-01-2026 : మనగళం : భారతీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం మరోసారి నష్టాల బాట పట్టాయి. ఉదయం ఆశాజనకంగా ప్రారంభమైన మార్కెట్లు క్రమంగా ఒత్తిడికి లోనై ముగింపు సమయానికి నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ రెండు వందల అరవై పాయింట్లకు పైగా కోల్పోగా, నిఫ్టీ యాభై పాయింట్లకు పైగా నష్టపోయింది. ఉదయం అంతర్జాతీయంగా అనుకూల సంకేతాలు, సాంకేతిక కొనుగోళ్లు కలిసి రావడంతో మార్కెట్లు లాభాలతో ప్రారంభమయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ మూడు వందల ఎనభై పాయింట్లకు పైగా పెరిగి ఎనభై నాలుగు వేల రెండు వందల యాభై ఎనిమిది స్థాయికి చేరింది. అదే సమయంలో నిఫ్టీ కూడా వంద తొమ్మిది పాయింట్లు ఎగబాకి ఇరవై ఐదు వేల ఎనిమిది వందల తొంభై తొమ్మిది స్థాయిని తాకింది. అయితే మధ్యాహ్నం తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వివిధ షేర్లపై అమ్మకాల ఒత్తిడి, మిశ్రమ సంకేతాలు, సుంకాలపై ఆందోళనలు కలిసి మార్కెట్లను దిగజార్చాయి. ఒక దశలో సెన్సెక్స్ ఏకంగా ఆరు వందల పాయింట్ల వరకు పడిపోయింది. చివరికి సెన్సెక్స్ సుమారు ఎనభై మూడు వేల ఆరు వందల స్థాయిలో ముగిసింది. నిఫ్టీ కూడా నష్టాల్లోనే ముగిసి ఇరవై ఐదు వేల ఏడు వందల స్థాయికి చేరింది. మార్కెట్ పతనంలో లార్సెన్ అండ్ టర్బో, హెచ్ సీఎల్ టెక్నాలజీస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతి ఎయిర్ టెల్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ వంటి ప్రధాన కంపెనీల షేర్లు నష్టాలను చవిచూశాయి. మరోవైపు డాలరుతో పోలిస్తే రూపాయి విలువ తొంభై పాయింట్ రెండు ఒక స్థాయికి బలహీనపడింది. అంతర్జాతీయంగా బంగారం ధరలు కూడా ఊగిసలాటకు లోనవుతూ ఔన్స్‌కు నాలుగు వేల ఐదు వందల ఇరవై ఎనిమిది డాలర్ల వద్ద ట్రేడయ్యాయి. మొత్తంగా చూస్తే, లాభాలతో మొదలైన మార్కెట్ రోజు చివరికి పెట్టుబడిదారులకు నిరాశనే మిగిల్చింది.

# మాజీ సైనిక వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ సైనికులు ఆత్మీయ సమావేశం



( ఆలూరు మనగళం ): ఆలూరు మండల కేంద్రంలో ఆర్ అండ్ బీ అధితి గృహంలో కర్నూలు జిల్లా సైనిక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు రత్నారూత్ అధ్యక్షతన మాజీ సైనుకులు ఆత్మీయ సమావేశం నిరహించారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా సైనిక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు రత్నారూత్ మాట్లాడుతూ మాజీ సైనికులకు రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న పథకాలు, లేదా రాయితీల, మాజీ సైనికుల పిల్లల చదువులు, మరియు విదర్థులకు స్కాలర్షిప్ ల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాజీ సైనుకులకు ఎవేర్నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేసి, ప్రతి మాజీ సైనికులకు ఐడి కార్డు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సూపర్డెంట్ (పర్యవేక్షకురాలు) మహేంద్రమ్మ, ఆలూరు మాజీ సైనికుల అధ్యక్షులు ఎస్.బి. శివ ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ఎం. గోపాల్, క్యాషియర్ బసవరాజు, ఎం.రంగస్వామి, డి.సి.గౌడ, ఏ.బసవరాజు, శ్రీనివాసులు, కమలమ్మ, బి.మహేష్, బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్యం అందేనా...?


- పేరుకే ఆసుపత్రి... పేదవాడికి అందని వైద్యం.
- ఆసుపత్రిలో ఆర్ఓ వాటర్ ప్లాంట్ ఉన్నా పేషెంట్లకు తాగడానికి నీరు కూడా లేని దుస్థితి.
- ప్రజా ప్రతినిధులు నూతన భవనాన్ని ప్రారంభించినా, కొత్త ఆసుపత్రిని వినియోగించుకోక తాళం వేసిన డాక్టర్లు.
- పోస్టుమార్టం గదిలో కరెంట్ లేని దుస్థితి.
- సంవత్సరాలు గడుస్తున్న కాంపౌండ్ వాల్ నిర్మించిలేని పరిస్థితి.
- సమయ పాలన పాటించని కొందరు వైద్యాధికారులు.
- ఏదైనా ఎమర్జెన్సీ కేసులు వస్తే రెఫర్.
- విలేకరులు ఆసుపత్రి సమస్యలపై మాట్లాడాలంటే డిడిఓ పర్మిషన్ తప్పనిసరినా..?
- గర్భిణీ స్త్రీలకు తాగడానికి మంచి నీటి లేని దుస్థితి.
- ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ (సిజరిన్) కేసులు ఊసే లేదు.
- వార్తలు రాసిన మారని వైద్యాధికారులు మరియు సిబ్బంది.




(ఆలూరు మనగళం): ఆలూరు మండల కేంద్రంలోని సి హెచ్ సి ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలు లేక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేషెంట్లు చుట్టుపక్కన ఉన్న ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన భవనం నిర్మించారు. ఈ భవనాన్ని ఒక నెల కిందట ప్రజా ప్రతినిధులు వచ్చి ఈ నూతన భవనాన్ని ప్రారంభించారు. ప్రారంభించడమే ఆలస్యం ఆ నూతన భవనాన్ని డాక్టర్లు వాడుకోకుండా దానికి తాళం వేసి ఉంచారు. అలాగే 30 పడకల బెడ్లను రూములు కూడా ఓపెన్ చేయకుండా అలాగే ఉంచారు. ఆసుపత్రిలో ఈసీజీ మిషన్ ఉన్న అందులో పేపర్లు లేకపోవడంతో మూలన ఉంచారు. మెరుగైన వైద్య సేవలు కరువై ప్రతి ఒక్క పేద కుటుంబానికి చెందిన వారు ప్రైవేట్ సెంటర్ కు వెళ్లి అక్కడ ఈసీజీ మరియు ఎక్రే తీసుకుంటున్నారు. ఆసుపత్రిలో ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ఉన్న పనిచేయని దుస్థితి ఏర్పడింది ఈ నీరు అక్కడ లేకపోవడంతో బయట నుంచి ఆటోలో ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి సప్లై చేసుకుంటున్నారు. అలాగే ఆసుపత్రి వెనుక ఉన్న కాంపౌండ్ వాల్ పడిపోయి సుమారు నెలలు గడుస్తున్న వైదాధికారులు చూసిచూరినట్లు వ్యవహరించడం విచిత్రంగా మారింది. ఆసుపత్రి వెనుక ఉన్న కాంపౌండ్ వాల్ పడిపోవడంతో వెనక నుండి ఆసుపత్రిలోనికి కుక్కలు ఇతర జంతువులు మనుషులు పాదాచారులు నడుచుకుంటూ ఆ దారిన రావడం గమనార్ధం. ఆసుపత్రిలో పోస్టుమార్టం రూమ్ ఉన్న ఆ రూములో విద్యుత్ కనెక్షన్ కూడా లేని దుస్థితి ఈ కథనాలపై విలేకరులు పలుసార్లు వార్తలు రాసిన ఎలాంటి స్పందన లేకపోవడం చర్చనీయంగా మారింది. కొన్నిసార్లు వార్తలు రాస్తే ఆలూరు ఆసుపత్రి డిడిఓ నువ్వు నన్ను టార్గెట్ చేశావు అంటూ విలేకరులను వ్యాఖ్యానించారు. విలేకరులు ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలోకి రావాలంటే ఐడి కార్డు వేసుకొని రావాలని ఇక్కడ ఫోటోలు ఏమైనా తీయాలంటే మా పర్మిషన్ ఉంటేనే మీరు తీయాలని డిడిఓ విలేఖరులకు సమాధానం ఇవ్వడం ఏంటో ఆసుపత్రికి వచ్చిన పేషెంట్లు విలేకరులతో మాట్లాడుతూ అన్నా ఇక్కడ సరైన చిన్నపాటి సదుపాయాలు మౌలిక వసతులు కరువయ్యాయని ఈ విషయాలు వైద్యాధికారులకు తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇక్కడ పేదవానరికి వైద్యం దొరికేనా అన్నట్టుగా ఉందని కనీసం తాగడానికి నీరు కూడా నీరులేని దుస్థితి ఏర్పడిందని ఎప్పుడైనా అత్యవసర సమయంలో ఇక్కడికి రాత్రి సమయంలో ఎమర్జెన్సీ కేసులు వస్తే డాక్టర్లు సమయానికి ఉండరని ఇక్కడ ఉండే సిస్టర్లు ఆన్లైన్ అంటే డాక్టర్లు ఇక్కడ లేకున్నా వారు ఫోన్లో మాట్లాడుతూ ఇక్కడ పేషెంట్లకు వైద్యం అందిస్తున్నారని ఎమర్జెన్సీ అని వస్తే ఆన్లైన్ వైద్యం అందించి ఇక్కడ కాకపోతే వెంటనే రెఫర్ చేస్తున్నారని తెలిపారు. అలాగే పోస్టుమార్టం కి కూడా కొందరి కుటుంబ సభ్యుల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారని డాక్టర్లు ఉదయం పది అయినా ఆసుపత్రిలో సమయానికి కనిపించరని ఇక్కడ మందులు కూడా కొన్ని బయటకే రాసిస్తున్నారని గర్భిణీ స్త్రీలు చూపించుకునే వార్డు దగ్గర వారు తాగడానికి ఒక మంచినీటి క్యాన్స్ సదుపాయం కూడా ఏర్పాటు చేయకుండా వారు నీరు తాగాలంటే ఆసుపత్రి బయటకు వచ్చి తాగే దుస్థితి ఏర్పడిందని ఆసుపత్రి వెనక కాంపౌండ్ వాల్ పడిపోయిందని తెలిసిన ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని వెనుక నుండి ఎవరైనా ఆకతాయిలు రాత్రి సమయంలో లోనికి ప్రవేశించి ఏదైనా జరగడానికి సంఘటన జరిగితే దానికి బాధ్యులు ఎవరంటూ మండిపడ్డారు.

ఈ విషయంపై ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రి డిడిఓ ను వివరణ అడగా ఆయన విలేకరితో మాట్లాడుతూ ఇక్కడ ఎక్రే





మిషన్ ఉంది. కానీ దీనికి ఆపరేటర్ లేడు అందుకే మేము పై అధికారులకు అప్రూవల్ పెట్టామని ఈ నూతన భవనం మాకు సరైన విధంగా లేదని ప్లానింగ్ చేసుకొని అతి తొందరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఇప్పటికైనా ఈ సిహెచ్ సి ఆసుపత్రికి సంబంధించిన (డి,సీ,హెచ్,ఎస్) అధికారి స్పందించి ఈ ఆసుపత్రిలో ఉన్న స్థితిగతులను సమస్యలను పరిశీలించి ఆలూరు ప్రభుత్వ వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రతి పేదవారికి వైద్య అందేలా చూడాలని ఆలూరు ప్రజలు ఆసుపత్రికి వచ్చిన పేషెంట్లు

# సంపాదకీయం

## సంప్రదాయానికి ప్రతీకగా భోగి

భోగి మంటలౌ సంక్రాంతి పండుగకు తొలి మెట్టు. గ్రామీణ జీవనంలో ఇది కేవలం ఒక వేడుక కాదు; పాతదాన్ని విడిచిపెట్టి కొత్త ఆశలతో ముందుకు సాగాలనే సంకేతం. ఇంటి ముందు వెలిగే మంటల చుట్టూ కుటుంబాలు, పిల్లలు, పెద్దలు చేరి ఆనందం పంచుకోవడం ఒక కాలానుగుణ సంస్కృతి. పాత పనికిరాని వస్తువులను త్యజించి, శుభారంభానికి సిద్ధమయ్యే భావన భోగి మంటల ఆత్మ. ఈ సంప్రదాయం తరతరాలుగా కొనసాగుతూ సమాజాన్ని ఒక తాటిపై నిలబెట్టింది.

కానీ కాలం మారింది. జీవనశైలి మారింది. ఒకప్పుడు సహజ పదార్థాలతో, పర్యావరణానికి హాని కలగకుండా నిర్వహించిన భోగి మంటలు, నేడు కొన్నిచోట్ల హద్దులు దాటుతున్నాయి. ప్లాస్టిక్, రబ్బరు, పాత టైర్లు, రసాయన పదార్థాలు మంటల్లో వేయడం వల్ల గాలి కాలుష్యం పెరుగుతోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా మారింది. ఆనందం కోసం చేసే వేడుక, అనుకోకుండా ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్న వాస్తవాన్ని విస్మరించలేం.

పర్యావరణ పరిరక్షణపై మాట్లాడుతున్న ఈ కాలంలో, భోగి మంటల నిర్వహణపై కూడా బాధ్యతాయుతమైన ఆలోచన అవసరం. సంప్రదాయం పేరుతో కాలుష్యాన్ని ప్రోత్సహించడం సమంజసం కాదు. పిల్లలకు మనం ఏ సందేశం ఇస్తున్నాం? పండుగ అంటే హద్దులు లేకుండా చేయడమేనా? లేక సమాజానికి, ప్రకృతికి మేలు చేసే విధంగా జరుపుకోవడమేనా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతకాల్సిన సమయం ఇది.

అయితే భోగి మంటలను పూర్తిగా నిరాకరించాలన్న వాదన కూడా సరైంది కాదు. సంప్రదాయాల మూలాన్ని అర్థం చేసుకొని, వాటిని కాలానికి తగ్గట్టు మార్చుకోవడమే పరిష్కారం. సహజంగా లభించే ఎండిన ఆకులు, చెక్క ముక్కలు వంటి పదార్థాలతో పరిమిత స్థాయిలో మంటలు వేయడం ఒక మార్గం. పర్యావరణానికి హాని కలగకుండా, సమాజాన్ని కలుపుతూ జరుపుకునే భోగి మంటలే నిజమైన పండుగ స్ఫూర్తి.

ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు మాత్రమే కాదౌ ప్రతి పౌరుడూ ఇందులో భాగస్వామి కావాలి. అవగాహన కార్యక్రమాలు, పాఠశాలల ద్వారా పిల్లలకు సరైన దిశానిర్దేశం, గ్రామ స్థాయిలో నియమాలు---ఇవన్నీ కలిసి పనిచేస్తే సంప్రదాయం కూడా నిలుస్తుంది, పర్యావరణం కూడా కాపాడబడుతుంది. భోగి మంటలు మన సంస్కృతికి ప్రతీక. ఆ ప్రతీకను కాలుష్యపు పొగలో కలిపేయకుండా, భవిష్యత్ తరాలకు గర్వంగా అందించడమే మన బాధ్యత.

పర్యావరణ పరిరక్షణపై మాట్లాడుతున్న ఈ కాలంలో, భోగి మంటల నిర్వహణపై కూడా బాధ్యతాయుతమైన ఆలోచన అవసరం. సంప్రదాయం పేరుతో కాలుష్యాన్ని ప్రోత్సహించడం సమంజసం కాదు. పిల్లలకు మనం ఏ సందేశం ఇస్తున్నాం? పండుగ అంటే హద్దులు లేకుండా చేయడమేనా? లేక సమాజానికి, ప్రకృతికి మేలు చేసే విధంగా జరుపుకోవడమేనా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతకాల్సిన సమయం ఇది.

అయితే భోగి మంటలను పూర్తిగా నిరాకరించాలన్న వాదన కూడా సరైంది కాదు. సంప్రదాయాల మూలాన్ని అర్థం చేసుకొని, వాటిని కాలానికి తగ్గట్టు మార్చుకోవడమే పరిష్కారం. సహజంగా లభించే ఎండిన ఆకులు, చెక్క ముక్కలు వంటి పదార్థాలతో పరిమిత స్థాయిలో మంటలు వేయడం ఒక మార్గం. పర్యావరణానికి హాని కలగకుండా, సమాజాన్ని కలుపుతూ జరుపుకునే భోగి మంటలే నిజమైన పండుగ స్ఫూర్తి.

ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు మాత్రమే కాదౌ ప్రతి పౌరుడూ ఇందులో భాగస్వామి కావాలి. అవగాహన కార్యక్రమాలు, పాఠశాలల ద్వారా పిల్లలకు సరైన దిశానిర్దేశం, గ్రామ స్థాయిలో నియమాలు---ఇవన్నీ కలిసి పనిచేస్తే సంప్రదాయం కూడా నిలుస్తుంది, పర్యావరణం కూడా కాపాడబడుతుంది. భోగి మంటలు మన సంస్కృతికి ప్రతీక. ఆ ప్రతీకను కాలుష్యపు పొగలో కలిపేయకుండా, భవిష్యత్ తరాలకు గర్వంగా అందించడమే మన బాధ్యత.

## ఎర్రగొండపాలెం ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



మన గళం పెద్ద దోర్నాల: ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని రైతులు, కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు ఈ నూతన సంవత్సరాన్ని సుఖసంతోషాలతో, భోగభాగ్యాలతో ఆనందంగా గడపాలని ఎర్రగొండపాలెం నియోజకవర్గ అసెంబ్లీ ఇంచార్జ్, ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి తంగిరాల అశోక్ రెడ్డి ఆకాంక్షించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ క్రొత్త సంవత్సరం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతూ, సిరిసంపదలు సమృద్ధిగా కలగాలని, శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై నిలవాలని ప్రార్థించారు.

దేశసేవ, ప్రజాసేవే ధ్యేయంగా సదా భరతమాత సేవలో కొనసాగుతామని పేర్కొంటూ, ఎర్రగొండపాలెం నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పెద్ద బొమ్మలాపురంలో ఉచిత గ్యాస్ స్టవ్, సిలిండర్ పంపిణీ

మన గళం పెద్ద దోర్నాల : పెద్ద బొమ్మలాపురం గ్రామంలో ఈరోజు నిరుపేద కుటుంబాలకు చెందిన 10 మంది మహిళలకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో పూర్తి ఉచితంగా కొత్త గ్యాస్ స్టవ్‌లు మరియు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో భారత్ గ్యాస్ డీలర్ రావి క్రింది లక్ష్మీనరసింహ, బీజేపీ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సురవరం వీరారెడ్డి, పెద్ద బొమ్మలాపురం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అమ్మిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు అమ్మిరెడ్డి మల్లారెడ్డి, మేడబోయిన రాజయ్య పాల్గొన్నారు. హాజరైన నాయకులు లబ్ధిదారులకు తమ చేతుల మీదుగా గ్యాస్ స్టవ్‌లు, సిలిండర్లు అందజేసి, ఈ పథకం ద్వారా పేద కుటుంబాలకు వంట గ్యాస్ సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల జీవన విధానం మెరుగుపడుతుందని తెలిపారు.



## స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



మన గళం అవుకు : నంద్యాల జిల్లా అవుకు మండలం పిక్కర్లపల్లి తాండా కు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు చల్లా సూర్య ప్రకాష్ రెడ్డి, బనగానపల్లె నియోజకవర్గం వైఎస్ఆర్సిపి మాజీ శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి, వైఎస్ఆర్సిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలింగ్ మెంబర్ చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కాటసాని ఓబుల్ రెడ్డి మంగళవారశీ మారెమ్మ ,శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ వార్షికోత్సశీ జాతర సందర్భంగా గ్రామ ప్రజలు ఆహ్వానం మేరకు స్వామి , అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

## ఆదోని జిల్లా సాధించేవరకు పోరాటం సాగిస్తాం




**- 33వ రిలే దీక్షల్లో హులేబీడు గ్రామస్థులు.**

(ఆలూరు మనగళం): ఆదోనిను జిల్లాగా ప్రకటించే వరకు పోరాటం సాగిస్తామని ఆలూరు జెఏసి నాయకులు కత్తి రామాంజినేయులు, ఎల్లప్ప, పూల రామాంజినేయులు తేల్చి చెప్పారు. ఆలూరు పట్టణంలో ఆదోని జిల్లా కోసం జెఏసి నిర్వహిస్తున్న రిలే దీక్షలు ఆదివారం 33వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఆలూరు మండలం హులేబీడు గ్రామ మాజీ ఎంపీటీసీ రామలింగ తో పాటు జంగం చిన్న బ్రెష్, పింజారి మోదిన్ సాబ్, బోయ మల్లేష్, శేఖన్న, శ్రీను, మురళి, వెంకటేష్, శెట్టి బలిజ రాఘవేంద్ర, బోయ మల్లయ్య, నాగరాజు, పింజరి చిన్నబాబు దీక్షల్లో కూర్చున్నారు. వీరికి బీఎస్పీ జిల్లా నాయకులు రామలింగ, సిపిఐ మండల కార్యదర్శి రామాంజినేయులు, వైసీపీ ఆర్ టి ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొట్టాల రాజు దీక్షలకు హాజరై సంగీబావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుక బడిన ఆలూరు ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదోనిను జిల్లాగా చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## డోన్ పాత హాస్పిటల్ నందుడయాలసిస్ సేవలు త్వరలో ప్రారంభిస్తాం ఎమ్మెల్యే కోట్ల

మన గళండోన్ పట్టణంలోని పాత ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి ని కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఆస్పత్రి భవనాన్ని డయాలసిస్ సెంటర్ గా అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డోను పాత ప్రభుత్వ ఆసుపత్రిలోనే డయాలసిస్ పేషెంట్లకు సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అవసరమైన మౌలిక సదుపాయాలు పరికరాలు వైద్య సిబ్బంది నియామకానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అధికారులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అయ్యప్ప స్వామి ఇరుముడి పూజాలో పాల్గొన్న గుమ్మనూరు నారాయణ, గుమ్మనూరు కమలమ్మ దంపతులు

( ఆలూరు మనగళం ): గుంతకల్ పట్టణంలో అయ్యప్ప స్వామి దేవాలయం నందు గుంతకల్ పట్టణానికి చెందిన ఉమాదేవి కుమారుడు అయ్యప్ప స్వామి ఇరుముడి పూజా కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానం మేరకు హాజరన ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, సతీమణి బీజేపీ నాయకురాలు గుమ్మనూరు కమలమ్మ. అనంతరం అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ బిజెపి నాయకులు, గుమ్మనూరు కుటుంబ సభ్యులు మరియు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





# స్థూల దేశీయోత్పత్తి వృద్ధే లక్ష్యంగా సమగ్ర ప్రణాళికలు

**- జిల్లా విజన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**

మనగళం, నంద్యాల : జిల్లా స్థూల దేశీయోత్పత్తి (డీడీపీ) పెంపును లక్ష్యంగా చేసుకుని స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్ యూనిట్ల ద్వారా సమగ్రంగా చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్లోని స్వర్ణాంధ్ర 2047 జిల్లా విజన్ ప్లాన్ యూనిట్‌లో స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి, పి--4 (ప్రభుత్వ--ప్రైవేటు--ప్రజల భాగస్వామ్యం) కార్యక్రమం, జిల్లా ప్రగతి సూచికలపై జిల్లా కలెక్టర్ విజన్ ప్లాన్ యూనిట్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఓ ఓబులేసు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో కలెక్టరేట్లో జిల్లా విజన్ ప్లాన్ యూనిట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, 7 నియోజకవర్గాల పరిధిలో కూడా ప్రత్యేక విజన్ ప్లాన్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా యూనిట్లలో విధులు నిర్వహించేందుకు యంగ్ ప్రొఫెషనల్స్ (యువ నిపుణులు) ను నియమించామని, వీరంతా వ్యవసాయ అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవారంగం అభివృద్ధిపై దృష్టి సారిస్తూ మండలాల స్థాయిలో ప్రగతికి తోడ్పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం ప్రతి విభాగంలో కనీసం 15 శాతం పురోగతి సాధించాల్సి ఉందని, అందుకు అనుగుణంగా ఉత్తమ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో తలసరి ఆదాయం అధికంగా (రూ.3 లక్షలకు పైగా) ఉన్న మండలంగా మహానంది ఉండగా, తక్కువ తలసరి ఆదాయం (రూ.లక్ష వరకు) ఉన్న మండలాలుగా నందికొట్కూరు, పగిడ్యాల ఉన్నాయని వివరించారు. అన్ని మండలాల్లో సమానమైన తలసరి ఆదాయం సాధించడంతో పాటు, రాష్ట్ర స్థాయిలో జిల్లా స్థూల



దేశీయోత్పత్తి పెరిగేలా విజన్ ప్లాన్ యూనిట్లు నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ అమలు చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. అదేవిధంగా పి--4 (ప్రభుత్వ--ప్రైవేటు--ప్రజల భాగస్వామ్యం) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 4,585 మంది మార్గదర్శులుగా నమోదు కాగా, 36,767 బంగారు కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న వారు పొందుతున్న ప్రయోజనాలపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా ప్రగతి సూచికల విషయంలో ఎలాంటి అలసత్వం వహించకుండా, కీ పర్ఫామెన్స్ ఇండికేటర్లను ఎప్పటికప్పుడు నమోదు చేసి నవీకరించేలా చర్యలు తీసుకోవాలని విజన్ ప్లాన్ యూనిట్ సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# మాచాపురం గ్రామంలో గడ్డివాము దగ్ధం

**- మంటలను అదుపు చేసిన ఫైర్ ఇంజన్...**






నందవరం జనవరి 13 మనగళం న్యూస్ : నందవరం మండల పరిధిలోని స్థానిక మాచాపురం గ్రామంలో మాల నరసింహుడు అనే రైతు మూగజీవులకు 50 వేల రూపాయలు పెట్టి వేరే గ్రామం నుంచి వరిగడ్డి కొని వాము వేయడం జరిగింది మంగళవారం రోజున మధ్యాహ్నం 2 గంటల సమయంలో మూగ జీవులకు కొన్న వరిగడ్డివాము అంటుకోవడం జరిగింది మాల నరసింహులు కుటుంబ సభ్యులు అందరూ పొలం పనులు కోసం పొలానికి వెళ్లడం జరిగిందని మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మంటలు రేగడంతో గడ్డివాము మొత్తము కాళీ బూడిద పోయిందని కుటుంబ సభ్యులు తెలియచేశారు అదే సమయంలో అక్కడున్న గ్రామ ప్రజలు మంటలను ఆర్పినా కూడా ప్రయత్నం వృధా అయిపోయిందని అక్కడ ఉన్నవాళ్లు ఫైర్ ఇంజన్ కి ఫోన్ చేసి రప్పించినారు అయినా ఫైర్ ఇంజన్ వస్తే తలకాలా గడ్డివాము మొత్తము ఖాళీ బూడిదైపోయిందని కుటుంబ సభ్యులు తెలియచేశారు కావున మా మీద దయ ఉంచి మాకు మూగజీవులకు సహాయం అందించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు

# శ్రీశైల మల్లన్నకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

మనగళం శ్రీశైలం : మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని పంచాహ్నిక దీక్షతో ఏడు రోజులపాటు నిర్వహింపబడే సంక్రాంతి బ్రహ్మోత్సవాలు రెండవ నాడైన ఈ రోజు (13.01.2026) శ్రీ స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. ఉత్సవాలలో భాగంగానే యాగశాల యందు శ్రీచండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిపించబడ్డాయి. అనంతరం లోకకల్యాణంకోసం జపాలు, పారాయణలు చేయడం జరిగింది. తరువాత మండపారాధనలు, పంచావరణార్చనలు, రుద్రహోమం కార్యక్రమాలను ఆగమశాస్త్రం ప్రకారంగా జరిపించబడ్డాయి. అదే విధంగా ఈ సాయంకాలం ప్రదోషకాలపూజలను, హోమాలను జరిపించిన తరువాత జపానుష్టానాలు జరిపించబడతాయి. భృంగివావాన సేవ ఈ బ్రహ్మోత్సవాలలో నిర్వహించబడే వాహనసేవలలో భాగంగా ఈ రోజు సాయంకాలం శ్రీ స్వామిఅమ్మవార్లకు భృంగివాహనసేవ జరిపించబడుతుంది. ఈ సేవలో శ్రీ స్వామిఅమ్మవారి ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకారమండపంలో భృంగివాహనంపై వేంచేపు చేయించి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించబడతాయి. తరువాత పురవీధులలో గ్రామోత్సవం జరిపించబడుతుంది. గ్రామోత్సవములో జానపద కళారూపాల ప్రదర్శన, కోలాటం తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేయబడ్డాయి. రేపటి కార్యక్రమాలు ఈ






బ్రహ్మోత్సవాలలో భాగంగా రేపు ( 14.01.2026) శ్రీ స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు, చండీశ్వరపూజ, మండపారాధనలు, పంచావరణార్చనలు, జపానుష్టానాలు, రుద్రహోమం, సాయంకాలం నిత్య హవనాలు,బలిహరణలు మొదలైన కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఈ ఉత్సవాలలో భాగంగా రేపు సాయంకాలం శ్రీ స్వామిఅమ్మవార్లకు కైలాసవాహనసేవ గ్రామోత్సవం జరిపించబడుతుంది.

# జనవరి 14న భోగిమంటలు కార్యక్రమం



మనగళం శ్రీశైలం : సంస్కృతీ సంప్రదాయ పరిరక్షణలో భాగంగా భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవస్థానం రేపు (14.01.2026) వేకువజామున "భోగిమంటలు" కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ప్రధాన ఆలయ మహాద్వారం ఎదురుగా గంగాధర మండపం వద్ద ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. కాగా సంక్రాంతి సందర్భంగా వేసే భోగిమంటలకు మన సంప్రదాయంలో ఎంతో విశిష్టత ఉంది. ఈ భోగిమంటలు వేయడం వలన దుష్టపీడలు విరగడై, అమంగళాలు తొలగి సకలశుభాలు కలుగుతాయని చెప్పబడుతోంది. ముఖ్యంగా మన సంస్కృతి సంప్రదాయాలపై అందరికీ మరింత అవగాహన కల్పించాలనే భావనతో ఏటా దేవస్థానం ఈ భోగిమంటల కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సామూహిక భోగిపండ్లు సంక్రాంతి బ్రహ్మోత్సవాల సందర్భంగా భోగిరోజున అనగా 14వ తేదీన ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఉచిత సామూహిక భోగిపండ్ల కార్యక్రమం నిర్వహించబడుతుంది. సనాతన ధర్మపరిరక్షణలో భాగంగా ఈ సామూహిక భోగిపండ్ల కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమములో చిన్నారులకు ఈ భోగిపండ్లు వేయబడుతాయి. ముగ్గుల పోటీలు సంక్రాంతి బ్రహ్మోత్సవాల సందర్భముగా సంక్రాంతి రోజున అనగా జనవరి 15వ తేదీన మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించబడుతున్నాయి. ఆ రోజు ఉదయం గం.7.30ల నుంచి నుండి ఆలయ దక్షిణమాడవీధిలో ఈ ముగ్గులపోటీలు నిర్వహించబడుతాయి. ఈ ముగ్గుల పోటీలలో పాల్గొనదలచిన వారు 14వ తేదీ సాయంత్రం గం.5.00లలోపల దేవస్థాన పరిపాలనా కార్యాలయములోని ప్రజాసంబంధాల విభాగంలో వారి పేర్లను నమోదు చేసుకోవలసినదిగా తెలియజేయుచున్నాము.

## శ్రీ ఐ.వై. రాజు మరియు వారి బృందం, పశ్చిమగోదావరి జిల్లా వారిచే వాయిద్య కచేరి కార్యక్రమశీ

మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (13.01.2026) శ్రీ ఐ.వై. రాజు మరియు వారి బృందం, పశ్చిమగోదావరి జిల్లా వారిచే వాయిద్య కచేరి కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ వాయిద్య కచేరి కార్యక్రమం నిర్వహించబడుతున్నది. ఈ కార్యక్రమములో వినాయక ప్రార్థన, వాతాపిగణపతిం, పంచరత్నకృతి, పాపనాశన శివంకృతి, శివశంభో తదితర గీతాలను ఆలాపించనున్నారు. ఈ కార్యక్రమములో క్లారెట్ సహకారాన్ని శ్రీ ఐ.వై. రాజు, వయోలిన్ సహకారాన్ని శ్రీ పురాణం గణపతిరావు, డోలు వాయిద్య సహకారాన్ని శ్రీ శ్రీనివాస్, శ్రీ ఐ. శ్రీనివాస్, మృదంగ సహకారాన్ని మురళీప్రసాద్, తంబూర సహకారాన్ని శ్రీ పురాణం అందించనున్నారు. రెండవ కార్యక్రమములో భాగంగా వందప డాన్స్ అకాడమీ, తాడిపత్రి, అనంతపురం జిల్లా వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. కాగా ఈ




నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.


# జెమిని యాప్‌లోనే షాపింగ్.. ఏఐతో కొనుగోళ్లు మరింత ఈజీ!

న్యూఢిల్లీ -- 13-01-2026 -- మన గళం : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచంలో మరో కీలక మార్పు చోటుచేసుకుంది. గూగుల్ జెమిని ఏఐ ఇకపై కేవలం ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే సాధనగా మాత్రమే కాకుండా, నేరుగా షాపింగ్ చేయించే వర్చువల్ వ్యాపారిగా మారుతోంది. వినియోగదారులు జెమిని యాప్‌లోనే తమకు కావాల్సిన వస్తువులను వెతికి, అక్కడికక్కడే కొనుగోలు చేసేలా కొత్త సౌకర్యాన్ని గూగుల్ ప్రవేశపెట్టింది.

ఈ కొత్త ఫీచర్ ద్వారా వినియోగదారులు ఇతర యాప్‌లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, జెమిని చాట్‌లోనే నచ్చిన వస్తువులను ఎంపిక చేసుకుని చెల్లింపులు పూర్తిచేసే అవకాశం కలుగుతుంది. ప్రయాణానికి సరిపోయే దుస్తులు, గృహోపకరణాలు, రోజువారీ అవసరాల వస్తువులు ఇలా ఏది కావాలన్నా జెమిని సూచనలతో సులభంగా కొనుగోలు చేయవచ్చు.

ఈ వినూత్న షాపింగ్ అనుభవాన్ని అందించేందుకు గూగుల్ పలు అంతర్జాతీయ రిటైల్ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీని ద్వారా ఏఐ ఆధారిత కొనుగోళ్లు రిటైల్ రంగంలో కొత్త దశకు నాంది పలుకుతున్నాయి. సాధారణ శోధనల నుంచి ఏజెంట్ ఆధారిత వాణిజ్యానికి మారడం ఒక కీలక పరిణామమని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఇదే సమయంలో వేగవంతమైన సరఫరాపై కూడా గూగుల్ దృష్టి పెట్టింది. డ్రోన్ సాంకేతికత ద్వారా తక్కువ సమయంలోనే వస్తువులు వినియోగదారుల వద్దకు చేరేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కొత్త షాపింగ్ ఫీచర్ ప్రస్తుతం అమెరికాలో మాత్రమే అందుబాటులో ఉన్నప్పటికీ, త్వరలోనే ఇతర దేశాలకు విస్తరించే అవకాశం ఉందని గూగుల్ వర్గాలు వెల్లడించాయి.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## ప్రతి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘాన్ని బలోపేతం చేద్దాం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం






మన గళం కోడుమూరు: బికెఎంయు రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో వ్యవసాయ కార్మికులు,జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కార్మికులు బోగి మంటల్లో జిరాంజి బిల్లు పత్రాలను బోగి మంటల్లో కాల్చి వెయ్యాలని బికెఎంయు జిల్లా అధ్యక్షులు కృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి శేషుకుమార్, సిపిఐ మండల కార్యదర్శి రాజు లు పిలుపు నిచ్చారు. స్థానిక హమాలీ సంఘం కార్యాలయంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల సమితి సమావేశం పట్టణ కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి శేషుకుమార్, సిపిఐ మండల కార్యదర్శి రాజు లు హాజరయ్యారు. ఈ సందర్బంగా కృష్ణ, శేషు కుమార్ లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు కేంద్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. నిత్యావసర ధరలు పెరుగుతున్న రోజుల్లో ఉపాధి కూలీల వేతనాలను రూ 305/నుండి రూ 240/ తగ్గించడం జరిగిందన్నారు. కోనేరు రంగారావు కమిటి సిఫారసులను అమలు చెయ్యాలని, ప్రభుత్వ భూములను నిరుపేద వ్యవసాయ కార్మికులకు పంచాలని, ప్రతి వ్యవసాయ కార్మికునికి సంవత్సరానికి రూ, 12000/ జీవన భృతి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించిన ఉపాధిహామీ చట్టాన్ని ప్రధాని మోదీ పూర్తిగా ఎత్తివేయడానికి పునుకున్నాడని, కార్పొరేట్ సంస్థలకు మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని దారాదత్తం చేస్తే సహించమని వారు ఆందోళన వ్యక్తం చేశారు నాడు ఉపాధిహామీ పథకాన్ని తీసుకురావడానికి పోరాటం చేస్తే నేడు ఆ పథకాన్ని రక్షించుకోవడానికి మరోసారి బిజెపి ప్రభుత్వం తో పోరాటానికి సన్నద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. సిపిఐ మండల కార్యదర్శి రాజు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజా సంఘాలు బలపడాలని అన్నారు. సిపిఐ శత జయంతి ఉత్సవాల ముగింపు కు ఈ నెల 18 న ఖమ్మం కు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు అలాగే అనంతరం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ సమావేశంలో రామాంజనేయులు, గిడ్డయ్యయాదవ్, ఊరుకుంద ఆచారి, ఢిల్లీ వెంకటేష్ యాదవ్,రజాక్, గొల్ల వెంకటేష్, మార్కొండయులు, వెంకటస్వామి, నాగేష్, అల్లీష, బాబురావు తదితరులు పాల్గొన్నారు

## కొత్త లేబర్ కోడ్స్ ప్రభావం..

న్యూఢిల్లీ -- 13-01-2026 -- మన గళం : దేశంలో అమలులోకి వచ్చిన కొత్త లేబర్ కోడ్స్ కారణంగా కార్పోరేట్ రంగంపై తీవ్ర ప్రభావం పడుతోంది. డిసెంబర్ త్రైమాసికంలోనే ఈ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపించిందని పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. కొత్త నిబంధనలతో కంపెనీల ఖర్చులు గణనీయంగా పెరిగాయని, దీని వల్ల తక్షణంగా లాభదాయకతపై ఒత్తిడి పెరిగే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. అయితే దీన్ని దీర్ఘకాలిక కార్మిక సంస్కరణల దిశగా ఒక తాత్కాలిక సర్దుబాటుగానే చూడాలని కార్పోరేట్ పెద్దలు అభిప్రాయపడుతున్నారు.

భారతదేశంలోని అగ్ర ఐటీ సంస్థలు ఇప్పటికే ఈ లేబర్ కోడ్స్ ప్రభావాన్ని ప్రకటించాయి. డిసెంబర్ త్రైమాసికంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థకు కొత్త నిబంధనల కారణంగా 2128 కోట్ల మేర అదనపు భారం పడింది. అదే విధంగా హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ సంస్థకు 956 కోట్ల వరకు అదనపు ఖర్చు నమోదైంది. వేతనాల నిర్వచనం విస్తరించడంతో గ్రాట్యుటీ, సెలవుల నగదీకరణ ఖర్చులను తిరిగి లెక్కించాల్సి వస్తోంది. దీని వల్ల రానున్న త్రైమాసికాల్లో మరిన్ని కంపెనీలు అదనపు వ్యయాలను ఎదుర్కొనే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. కొత్త కార్మిక నిబంధనలతో యజమానులు, ఉద్యోగులు ఇద్దరూ సామాజిక భద్రతా చందాలను ఎక్కువగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీని ఫలితంగా కంపెనీల మొత్తం వ్యయం పెద్దగా మారకపోయినా, ఉద్యోగుల చేతికి వచ్చే వేతనం స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ప్రాథమిక జీతం 50 శాతం కంటే తక్కువగా ఉన్న సంస్థలు ఎక్కువ ప్రభావాన్ని ఎదుర్కొనే అవకాశముందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. గ్రాట్యుటీ వ్యయం ఈ మార్పుల్లో అత్యంత కీలకమైన అంశంగా మారింది. ఇది ప్రస్తుత ఉద్యోగుల గత సేవా కాలాలకు కూడా వర్తించడంతో ఖర్చు భారంగా మారుతోంది. ఐటీ సేవలు, తయారీ రంగాలతో పాటు ఆర్థిక సేవల సంస్థలు కూడా ఈ లేబర్ కోడ్స్ ప్రభావాన్ని అనుభవించవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే సంస్థల అంచనాల ప్రకారం దీర్ఘకాలంలో ఆపరేటింగ్ మార్జిన్లపై పెద్ద ప్రభావం ఉండదని, ఇది ఒకసారి మాత్రమే వచ్చే వ్యయంగా పరిమితం అవుతుందని చెబుతున్నారు.

## వీధి కుక్కల దాడులపై సుప్రీంకోర్టు కీలక హెచ్చరికలు

న్యూఢిల్లీ, జనవరి 13 , మన గళం : జాతీయ స్థాయిలో వివాదాస్పదంగా మారిన వీధి కుక్కల సమస్యపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇకపై వీధి కుక్కల దాడిలో గాయపడిన లేదా మరణించిన వారి కుటుంబాలకు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలే భారీ పరిహారం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. వీధి కుక్కల నియంత్రణలో నిర్లక్ష్యం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వీ. అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. గత ఐదేళ్లుగా వీధి కుక్కల నియంత్రణకు సంబంధించిన నిబంధనలను రాష్ట్రాలు సరిగా అమలు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ధర్మాసనం అభిప్రాయపడింది.

కుక్క కాటుకు గురైన వ్యక్తిపై దాని ప్రభావం జీవితకాలం ఉంటుందని కోర్టు పేర్కొంది. అదే విధంగా వీధి కుక్కలకు ఆహారం పెడుతున్న వారిపైనా అసహనం వ్యక్తం చేసింది. వీధి శునకాలపై నిజంగా ప్రేమ ఉంటే వాటిని ఇంటికి తీసుకెళ్లి పెంచుకోవాలని సూచించింది. కుక్కలు వీధుల్లో తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సమస్య భావోద్వేగపూరితమైనదైనా, ప్రజల భద్రతే ప్రధానమని పేర్కొంది.

ఇదిలా ఉండగా, వ్యవస్థీకృత ప్రాంతాలు, రోడ్లపై సంచరించే జంతువులను తొలగించాలన్న గత ఉత్తర్వులను సవరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై కూడా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. గుజరాత్‌కు చెందిన ఒక న్యాయవాదిని పార్కులో కుక్క కరిచిన ఘటనను ధర్మాసనం ప్రస్తావించింది. ఆ కుక్కను పట్టుకునేందుకు అధికారులు వెళ్లినప్పుడు జంతు ప్రేమికులు దాడి చేశారని పేర్కొంది. నాలుగు రోజులుగా ఈ అంశంపై వాదనలు వింటున్నామని, అయితే కార్యకర్తలు, ఎన్‌జీఓల వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను పూర్తిగా వినలేకపోతున్నామని కోర్టు అసహనం వ్యక్తం చేసింది.

"కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తగిన ఉత్తర్వులు జారీ చేయడానికి మాకు అవకాశం ఇవ్వండి. సమస్య రోజురోజుకు వెయ్యిరెట్లు పెరుగుతోంది. తదుపరి కార్యచరణ కోసం ముందుకు సాగనివ్వండి" అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

## రాఘవ రెడ్డి, బోయ హనుమంతు అకాల మరణం పార్టీకి తీరని లోటు





మన గళం సీ బెలగల్; కోడుమూరు నియోజకవర్గంలోని సీ బెలగల్ మండల పరిధిలోని కే. సింగవరం గ్రామానికి చెందిన వైయఅబశ్రీశ్రీస్ఆర్‌సీపీ సీనియర్ నాయకులు రాఘవ రెడ్డి, చింతామనుపల్లె గ్రామానికి చెందిన బోయ హనుమంతు అకాలంగా మృతి చెందడం పట్ల పార్టీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. మండల కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి ద్వారా సమాచారం అందుకున్న వెంటనే కుడా మాజీ చైర్మన్, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి కోడుమూరు నియోజకవర్గ వైయఅబశ్రీశ్రీస్ఆర్‌సీపీ ఇంచార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయా గ్రామాల్లోని వారి స్వఅబశ్రీశ్రీగృహాలఅబశ్రీశ్రీకు వైయఅబశ్రీశ్రీస్ఆర్‌సీపీ నేతఅబశ్రీశ్రీలు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్ వెళ్లి పార్థివ దేహాలఅబశ్రీశ్రీకు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలు, నాయకుల అకాల మరణం వైయఅబశ్రీశ్రీస్ఆర్‌సీపీకి తీరని లోటని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని ఆకాంక్షించారు. వారితో పాటు జిల్లా మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఎం భాషా, మేధావులు విభాగం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, రాధాకృష్ణారెడ్డి, కోడుమూరు నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు నరసింహులు, డాక్టర్ విభాగం అధ్యక్షులు, కో ఆప్షన్ మెంబర్ హారన్, మండల ట్రెజరీ వెంకటేష్, యువజన విభాగం జిల్లా కార్యదర్శి రాజు, మండల ఉప అధ్యక్షులు మహానంది, లచప్ప, రామచంద్ర రెడ్డి, మండల కార్యదర్శి మద్దిలేటి, రామకృష్ణ, దస్తగిరి, రంగా నాయుడు, వెల్డింగ్ అహమ్మద్, ముల్లా బాషా, ఖాజా, వీరన్న, సుంకన్న, బజారి, నాయకులు కార్యకర్తలు తదిరులు ఉన్నారు.

# ప్రజల మనిషి పోరాటాల నాయకుడు

డెస్క్, జనవరి 13 ,మన గళం: భారత స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమానికి రాజకీయ దిశానిర్దేశం చేసిన మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి పేరు భారత రాజకీయ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోతుంది. ఆయన జీవితం ఒక వ్యక్తిగత ప్రయాణం మాత్రమే కాదు; అది కోట్ల మంది ఆకాంక్షలకు, ప్రాంతీయ అసమానతలపై సాగిన పోరాటాలకు ప్రతిబింబం. అధికారాన్ని ఆశించిన నాయకుడిగా కాకుండా, ప్రజల బాధలను తన బాధలుగా మలుచుకున్న రాజకీయ నాయకుడిగా ఆయన గుర్తుండిపోతారు.

స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనే మర్రి చెన్నారెడ్డి పోరాట పంథ స్పష్టంగా కనిపించింది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించిన ఆయన, అనేకసార్లు జైలుశిక్షను ఎదుర్కొన్నారు. జైలు గోడలు ఆయన ఆలోచనలను బంధించలేకపోయాయి. దేశానికి స్వేచ్ఛ మాత్రమే కాదు, స్వేచ్ఛ తర్వాత ప్రజలకు న్యాయం, సమానత్వం అవసరమని ఆయన అప్పుడే గ్రహించారు. అందుకే స్వాతంత్ర్యానంతర రాజకీయాల్లో ఆయన దృష్టి ప్రజల జీవన ప్రమాణాలపైనే కేంద్రీకృతమైంది.

తెలంగాణ ఉద్యమ చరిత్రలో మర్రి చెన్నారెడ్డి పాత్ర అత్యంత కీలకం. ప్రాంతీయ అసమానతలు, నీటి వనరుల పంపిణీ, ఉద్యోగ అవకాశాల్లో వివక్ష వంటి అంశాలను ఆయన రాజకీయ వేదికపైకి తీసుకొచ్చారు. భావోద్వేగాలకే పరిమితం కాకుండా, గణాంకాలు, రాజ్యాంగ హక్కులు, విధానపరమైన లోపాలను ఆధారంగా చేసుకుని తెలంగాణ వాదనను బలంగా వినిపించారు. తెలంగాణ సమస్యను దేశవ్యాప్తంగా చర్చకు తెచ్చిన తొలి రాజకీయ నేతల్లో ఆయన ఒకరు అనే విషయంలో ఎలాంటి సందేహం లేదు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా ఆయన రాజకీయ తత్వం మారలేదు. అధికారం అంటే హోదా కాదు, బాధ్యత అనే భావనను ఆయన ఆచరణలో చూపించారు. గ్రామీణాభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, పేదల సంక్షేమం వంటి అంశాలపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ప్రజల మధ్యనే ఉండే ప్రయత్నం చేశారు. అధికార భవనాలకన్నా ప్రజల గడపలే ఆయనకు నిజమైన పాలన కేంద్రాలుగా ఉండేవి.

మర్రి చెన్నారెడ్డి రాజకీయ జీవితంలో మరో విశిష్టత -- ప్రజాస్వామ్య విలువల పట్ల ఆయన చూపిన నిబద్ధత. విభేదాలను శత్రుత్వంగా కాకుండా, చర్చల ద్వారా పరిష్కరించాలనే దృక్పథం ఆయనది. విభిన్న అభిప్రాయాలను గౌరవించడం, ప్రతిపక్ష స్వరాన్ని కూడా ప్రజాస్వామ్య భాగంగా చూడడం ఆయన రాజకీయ సంస్కృతికి నిదర్శనం. ఈ రోజు రాజకీయాల్లో అరుదుగా కనిపించే సహనశీలత ఆయనలో సహజంగా ఉండేది.

నేటి తరానికి మర్రి చెన్నారెడ్డి జీవితం ఒక గొప్ప పాఠం. ఉద్యమం అంటే కేవలం నినాదాలు కాదు, దీర్ఘకాలిక దృష్టి కావాలని ఆయన చూపించారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజల పక్షాన నిలబడడమే నిజమైన నాయకత్వమని ఆయన నిరూపించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు తరంలోనే ఆ ఆలోచనల విత్తనాలు నాటిన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారు. మొత్తానికి, స్వర్గీయ మర్రి చెన్నారెడ్డి జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకోవడం అంటే ఒక వ్యక్తిని మాత్రమే గుర్తుచేసుకోవడం కాదు. అది విలువల రాజకీయాన్ని, ప్రజల కోసం తపించిన నాయకత్వాన్ని, ఉద్యమాలకు సూత్రబద్ధతను గుర్తు చేసుకోవడమే. ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు, చూపిన దార్శనికత -- ఇవన్నీ తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయి.

# అపూర్వ సమ్మేళనం





**– పద్దెనిమిదేళ్ల తర్వాత కలిసి పూర్వ విద్యార్థులు**

మనగళం, కల్లూరు : కల్లూరు మండల పరిధిలోని ఉల్లిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (2006- 2007 పదవ తరగతి) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు, వ్యాపారాలలో స్థిరపడిన పూర్వవిద్యార్థులు పద్దెనిమిదేళ్ల తర్వాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. అప్పటి సంగతులు గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కుంటున్న ఓ స్నేహితురాలికి ఆర్థిక సాయం చేశారు. అదేవిధంగా ఉల్లిందకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఆర్చ్ గేట్ నిర్మాణం పూర్తి చేసి గురువుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. గురువులకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి మెమొంటోలు అందజేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు పూర్వ విద్యార్థులు. కార్యక్రమంలో రిటైర్డ్ హెడ్మాస్టర్ విజయకుమారి, ద్వారకానాథ్ శాస్త్రి, పిచెం రాజు, మధుసూదన శర్మ, సర్వేశ్వరరావు, జ్ఞానప్రసన్న, ఇందిరమ్మ, సులోచన, శ్యామలమ్మ, ప్రసాద్, వెంకటేశ్వర్లు, స్వర్ణలతమ్మ, లీలావతి, ఉపాధ్యాయులు జర్నలిస్ట్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను కట్టుదిట్టంగా జరపాలి

**– విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి – జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**






మనగళం, కర్నూలు సిటీ : జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల ను అన్ని సౌకర్యాలు కల్పించి , కట్టుదిట్టంగా జరపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులకు సూచించారు.

బుధవారం ఉదయం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన కో ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రాక్టికల్ పరీక్షలకు కావలసిన అన్ని వసతులు కల్పించాలన్నారు. ఏకాగ్రతకు భంగం కలగకుండా చర్యలు ఉండాలని , సెల్ ఫోన్లను అనుమతించరాదన్నారు. పరీక్షలను కట్టుదిట్టంగా ఎటువంటి సంఘటనలు జరగకుండా నిర్వహించాలని, పరీక్ష కేంద్రాలలో సౌకర్యాలు సరిగా లేకుంటే చర్యలు తీసుకుంటామని అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్ఐవో లాలెప్ప మాట్లాడుతూ... ప్రాక్టికల్ పరీక్షలను 3 విడతలుగా జనరల్ విద్యార్థులు 20 మందిని చొప్పున, ఒకేషనల్ విద్యార్థులను 40 మంది చొప్పున నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షలు జనవరి 27 నుండి మొదలైతాయని మొత్తం 21,150 మంది పరీక్షలకు హాజరవుతారని , జిల్లా మొత్తంగా 100 పరీక్షా కేంద్రాలు ఉంటాయని , సీసీటీవీ ల కెమెరాలు , ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణలో మరియు పోలీసుల సహకారం తో 144 సెక్షన్ విధించి పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు. ఈ సమావేశానికి అసిస్టెంట్ కమిషనర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ గోవింద నాయక్, అడిషనల్ మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, జిల్లా ఇమ్మ్యూనైజేషన్ ఆఫీసర్ ఉమా, ట్రాన్స్కో డిఇ భాస్కర్ , సమగ్ర శిక్ష అభియాన్ నుండి సుహాసిని , సోషల్ వెల్ఫేర్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి , జిల్లా ఒకేషనల్ అధికారి సురేష్ బాబు , ఆర్టీసీ తరపున డిపో మేనేజర్ సుధారాణి , త్రీటౌన్ సీఐ శేషయ్య , ఫ్లయింగ్ స్క్వాడ్ కు చెందిన ప్రిన్సిపాల్ లు, లెక్చరర్ లు,డిస్ట్రిక్ట్ ఎక్సమినేషన్ కమిటీ సభ్యులు మొదలగు వారు పాల్గొన్నారు.

# బేడ బుడగ జంగం యువత మేల్కోవాలి

**– హక్కుల సాధనకు ఉద్యమించాలి – 18న విద్యార్థులతో సమావేశం – బేడ బుడగ జంగం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తూర్పాటి మనోహర్**



మనగళం, నందికొట్కూరు : నేటికీ బేడ బుడగ జంగాలు అన్నివిధాలుగా నష్టపోతూనే ఉన్నారని, కనీసం కు ధ్రువీకరణ పొందలేని దుస్థితి నెలకొందని బేడ బుడగ జంగం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మన యువకులు మేల్కోవాలని, మన హక్కుల సాధనకు ఐకమత్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం బీబీజే నందికోట్కూరు తాలూకా అధ్యక్షుడు శిరువాటి చిన్నబాబు ఆధ్వర్యంలో మండల కేంద్రం నందికొట్కూరు పగిడ్యాల రోడ్, బ్రహ్మంగారి మఠం సమీపానున్న సుంకులమ్మ పోచమ్మ గుడిలో నిర్వహించిన నాయకుల సమావేశానికి తూర్పాటి మనోహర్ హాజరయ్యారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 18వ తేదీన కర్నూలు హార్ట్ ఫౌండేషన్ భవనంలో నిర్వహించనున్న బేడ, బుడగ జంగం యువత సమావేశానికి సంబంధించిన కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా తూర్పాటి మనోహర్ తోపాటు నందికోట్కూరు తాలూకా అధ్యక్షుడు శిరువాటి చిన్నబాబు మాట్లాడారు. కుల ధ్రువీకరణ పత్రం లేని బేడ, బుడగజంగం సామాజిక వర్గంగా మనం దుర్భర జీవితం గడుపుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి కుల ధ్రువీకరణ పత్రం కోసం పోరాడుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు పాలకులు మనపై జాలి చూపుతున్నారే తప్ప సమస్య పరిష్కారం కావడం లేదని, హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకించి విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతమని విచారం వ్యక్తం చేశారు. విద్యార్థులు, ఉన్నత విద్యనభ్యశించిన యువత ఎదుర్కుంటున్న సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని, ఉద్యమ ప్రణాలిక రూపొందించేందుకు ఈ నెల 18వ తేదీన నిర్వహించే సమావేశానికి తరలివచ్చి సమస్యలు వివరించడంతోపాటు సూచనలు ఇవ్వాలని కోరారు. కార్యక్ర మంలో నాయకులు దూపం శ్రీను, శిరువాటి శేఖర్, శిరువాటి రమేష్, రుద్రాక్షల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలి





మనగళం, ఓర్వకల్లు : ఓర్వకల్లు సమీపంలో నిర్మించనున్న కంపనీలు భూములు కోల్పోయిన బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బ్రాహ్మణపల్లె, తిప్పాయపల్లె, కునాల గ్రామాల పరిధిలో ఉన్న రిలయన్స్ - బేవరేజెస్ (క్యాంప) కోకా - కోల కంపెనీ ను సందర్శించారు. పొలాలు ఇచ్చిన రైతుల కుటుంబాలలో ఉన్న నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. స్థానికులకు ఇండస్ట్రియల్ ప్రకారం 70శాతం ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు. అలాగే కాల్వ రైతులకు ఇచ్చిన స్థలాలలో రోడ్డు వేస్తున్నారని, ముందు వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా, ఏ మాత్రం సంప్రదించకుండా పనులు చేయకూడదని హెచ్చరించారు. రైతులను సంప్రదించి వారి అంగీకారంతోనే పనులు మొదలుపెట్టాలని కంపెనీ ప్రతినిధులకు ఈ సందర్భంగా కాటసాని సూచించారు.

# అనధికార విభజనలకు అడ్డుకట్ట

**– పూర్వీకుల వ్యవసాయ భూముల విభజన పత్రాలపై సరళమైన స్టాంప్ డ్యూటీ విధానం – నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

మనగళం, నంద్యాల : పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూముల విభజనకు సంబంధించి ప్రజలకు మరింత సులభమైన, పారదర్శకమైన విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఆధారంగా, విల్ లేకుండా (ఇన్టెస్టేట్ డెత్స్) వారసత్వంగా లభించిన పూర్వీకుల వ్యవసాయ భూముల విభజన పత్రాలపై (పార్టియేషన్ డీడ్స్) స్థిరమైన (ఫిక్స్డ్) స్టాంప్ డ్యూటీని నిర్ణయించినట్లు కలెక్టర్ వివరించారు. ఈ నూతన నిబంధనల ప్రకారం, విభజనకు లోబడి ఉన్న భూమి మొత్తం మార్కెట్ విలువ రూ.10 లక్షల వరకు ఉంటే కేవలం రూ.100 స్టాంప్ డ్యూటీ మాత్రమే వసూలు చేయబడుతుందన్నారు. భూమి మొత్తం మార్కెట్ విలువ రూ.10 లక్షలకు మించి ఉంటే రూ.1,000 స్థిర స్టాంప్ డ్యూటీగా నిర్ణయించబడిందన్నారు. ఇప్పటి వరకు కుటుంబ వారసత్వ భూముల విభజనలో నమోదు లేకుండానే మ్యూటేషన్‌లు జరగడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లడమే కాకుండా, భవిష్యత్‌లో వివాదాలకు దారి తీసే అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజలపై ఆర్థిక భారం తగ్గించడానికే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా, విభజన పత్రాలపై స్టాంప్ డ్యూటీ వసూలుకు సంబంధించి గతంలో జారీ చేసిన సర్క్యులర్ సూచనలను ప్రభుత్వం రద్దు చేసిందని, ఇకపై ఒకే విధమైన ఏకరీతి విధానం అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నూతన నిర్ణయంతో ప్రజలు



తప్పనిసరిగా విభజన పత్రాలను రిజిస్ట్రేషన్ చేయించుకునేలా ప్రోత్సాహం లభిస్తుందని, చట్టబద్ధమైన హక్కులు భద్రపడటంతో పాటు భవిష్యత్ తగాదాలకు చెక్ పడుతుందని కలెక్టర్ తెలిపారు.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.